రంగారెడ్డి I వికారాబాద్ I మేడ్చల్

వార్త



## నిషేధిత జాబితాలో భూములు అమ్మకండి

**కడ్తాల్, జూలై 16, ప్రభాత వార్త :** కడ్తాల్ మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉన్న భూములు అట్టి సర్వే నెంబర్లు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 22 ఎ రిజిస్టర్‌లో గుర్తించడం జరిగిందని అట్టి భూములు అమ్మరాదు.. కొనరాదని... ఎవరైనా అమ్మిన కొన్న చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కడ్తాల్ తహసిల్దార్ ముంతాజ్ బేగం అన్నారు. బుధవారం ఆమె ప్రకటన విడుదల చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న లావుని పట్టాలు, సీలింగ్ పట్టాలు, భూదాన్ భూములు, ఎండోమెంట్, వక్ఫ్ బోర్డు, ఫారెస్ట్ మొదలగు భూములను క్రయవిక్రయాలు నిషేధించబడ్డాయని అన్నారు. ఎవరైనా అమ్మిన లేదా కొనుగోలు చేసిన అగ్రిమెంట్ చేసిన చట్టరీత్యా నేరముగా పరిగణించబడతారన్నారు. ఇటువంటి భూములు అసైన్మెంట్ పట్టాదారులు వారి యొక్క వారసులు మాత్రమే అనుభవించడానికి అర్హులని ఆమె తెలిపారు. ఎవరైనా రైతులు రియల్ వ్యాపారస్తుల, దళారుల మాటలు నమ్మి ఎటువంటి అగ్రిమెంటు చేయరాదన్నారు.

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో సీసీ రోడ్డు మంజూరు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూలై16 :** షాద్‌నగర్ పట్టణంలోని పటేల్ రోడ్డులో 9 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో అధికారులు సీసీ రోడ్డును మంజూరు చేశారు. మొదట నాలుగు న్నర మీటర్ల రోడ్డును అధికారులు మంజూరు చేయగా కోటి రూపాయలతో రోడ్డు నిర్మాణ పనులకు కసరత్తులు ప్రారంభించారు. అయితే మారుతున్న పరిణామాలు, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం తదితరులు ఎమ్మెల్యే శంకర్‌ను కలిసి సమస్యను వివరించారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ 9 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీనికి సంబంధించి అదనపు నిధులను కూడా మంజూరు చేసేందుకు అంగీకరించారు. పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య పటేల్ రోడ్డు ప్రధాన రహదారి విస్తరణ పనులను పర్యవేక్షించారు.. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నె రవి, నీరటి వాసు, రాజమోని జగదీశ్వర్, రాజమోని నర్సింగ్ రాజ్, సుంకర సత్యనారాయణ,రాజమోని యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



నిందితున్ని విచారిస్తున్న పోలీసులు

4

### పీచు మిఠాయిల మాటున

## గంజాయి చాక్లెట్లు!

**తాండూరులో 45 చాక్లెట్లు స్వాధీనం**

**పోలీసుల అదుపులో యూపీకి చెందిన వ్యక్తి**



లబ్ధిదారులకు ఇళ్ళ మంజూరు పత్రాల ు పంపిణీ చేస్తున్న మండల మాజీ ఉపాధ్యక్షుడు దేశ్యనాయక్

### ఇందిరమ్మ రాజ్యంలోనే

## సొంతింటి కల సాకారం

**బొంరాస్‌పేట్, జులై 16, ప్రభాతవార్త:** ఇందిరమ్మ రాజ్యం లోనే పేదల సొంతింటి కల నెర వేరుతున్నదని మండల మాజీ ఉపాధ్యక్షుడు దేశ్య నాయక్ అన్నారు. బుధవారం బొట్లవోని తండా గ్రామ పంచాయతీ పరిధిలోని తిరుమల కుచ్చ తండాలో అర్హులైన ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులకు ఇళ్ళ మంజూరి పత్రాల ు ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఇళ్ళ నిర్మాణానికై లబ్ధిదారుల స్వంత ఖాళీ స్థలం లో పంచాయతీ కార్యదర్శి శివ లింగప్ప నిబంధనల మేరకు ముగ్గు వేశారు. ఈ సందర్భంగా మండల మాజీ ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాం లో పేదల సొంతింటి కల కలగానే మిగిలిందని కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వం లోని ఇందిరమ్మ రాజ్యం లో పేదల సొంతింటి కల నెరవేరుతుండగా వారి కుటుంబాల్లో ఆనందం వెల్లి విరుస్తున్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ మేగ్య నాయక్ , గోపాల్ నాయక్,మన్య నాయక్,సుబ్యా నాయక్, తార్య నాయక్, సురేశ్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరికలు

**కడ్తాల్, జూలై 16, ప్రభాత వార్త :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, బీఆర్ఎస్ నేత జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్‌కు పరిపాలనపై సరైన అవగాహన లేక రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు మళ్లీ కెసిఆర్ జైపాల్ యాదవ్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మక్తమాదారం గ్రామానికి చెందిన మర్ల రాజేందర్ యాదవ్ కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కేసీఆర్ పై నమ్మకంతో గులాబీ గూటికి చేరిన రాజేందర్ యాదవ్‌కు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీ నేతలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచన సాయిలు భాగ్యమ్మ జంగయ్య గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఊరించి ఉసూరు మనిపించి..

**నామినేటెడ్ పదవుల పందేరంపై ప్రతిష్టంభన**

**యేడాదిన్నరగా అదిగో ఇదిగో అంటూ ప్రకటనలు**

**వివిధ పాలక వర్గ పదవులపై కాంగ్రెస్ నేతల ఆశలు**

**అధినేతల ప్రసన్నం కోసం పైరవీలు**

**స్థానిక ఎన్నికలు వస్తున్న ముందడుగు పడని భర్తీ నప్రక్రియ**

**పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రయోజనం ఏముందని స్థానిక నేతల ఆవేదన**

**రానున్న ఎన్నికలపై అసంతృప్తుల ప్రభావం ఉంటుందంటున్న క్యాడర్**

**రంగారెడ్డిఅర్బన్, జూలై 16, ప్రభాత వార్త:** నామినేటెడ్ పదవుల కోసం కాంగ్రెస్ నేతలకు నిరీక్షణ తప్పడం లేదు. పార్టీ అధికారంలోకి వచ్చి యేడాదిన్నర అవుతున్నా నామినేటెడ్ పదవుల నియామకంలో ఇంకా కొన్ని అవకాశాలను భర్తీ చేయడం లేదు. ప్రధానంగా జిల్లా, నియోజకవర్గ స్థాయి పలు పదవులతో పాటు, గ్రంథాలయ సంస్థ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఆలయాల చైర్మన్ల పదవులపై కన్నేసిన నాయకులు నిర్విరామంగా తమ ప్రయత్నాలను కొనసాగిస్తునే ఉన్నారు. పార్టీలో సీనియర్లకు పెద్దపీట వేయాలనే ఆలోచనతో పీసీసీ నేతలు ఉండడం, మంత్రివర్గ విస్తరణ అయినా తర్వాత నామినేటెడ్ పదువలపై నిర్ణయాలు తీసుకుటామని ఎమ్మెల్యేలకు, పార్టీ ఇన్‌చార్జిలకు తెలియజేస్తున్నట్లుగా ప్రచారం జరిగింది. అయినా నామినేటెడ్ పదవుల భర్తీపై ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. ఈ క్రమంలో సంవత్స రాల తరబడి పార్టీలో పనిచేశాం... అయినా సరైనా గుర్తింపు దక్కడం లేదన్న నైరాశ్యం కొంతమంది కాంగ్రెస్ నేతల్లో నెలకొంది.

**జిల్లాలో రాజకీయ పరిస్థితి ఇలా..**

జిల్లాలో సుమారు ఏడాదిన్నర క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం, షాద్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థు కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్ విజయం సాధించారు.చేవెళ్ల, మహేశ్వరం, లో బీఆర్ఎస్ అభ్యర్థులు కాలే యాదయ్య, సబితా ఇంద్రారెడ్డి గెలుపొందినప్పటికీ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో భాగంగా కాలే యాదయ్య కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీలో ఆయా నియోజకవర్గాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిల పాత్ర కీలకంగా ఉంటుంది. వీరు ప్రతిపాదించిన వారికే నామినేటెడ్ పదవులు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**స్థానిక ఎన్నికల తర్వాతేనా..?**

ప్రత్యేకాధికారుల పాలనతో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలకవర్గాలకు ఎన్నికలు జరగాల్సి ఉన్న నేపథ్యంలో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల్లోనూ కీలకమైన ఎంపీపీ, జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్ పదువులపైనా చాలా మంది ఆశలు పెట్టుకున్నారు.

ఇప్పటి నుంచే జోరుగా నమ్మకంతో నేతల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో టికెట్లు ఆశిస్తున్న వారికి కాకుండా నామినేటెడ్ పదవుల్లో అవకాశం కాకుండా మిగిలిని వారికి ఇచ్చే చాన్స్ ఉందన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. దీనికి తోడు పార్టీలో పదేళ్లు పైబడి పనిచేసినవారికి ముందు ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ ఇటీవల తెలిపిన అంశం సైతం చర్చల్లోకి వస్తోంది. ఈ పరిణామాలన్నీ కూడా నామినేటెడ్ పదవులను సీనియర్లకే అన్నట్లుగా సుస్పష్టం చేస్తున్నాయి. అంతేకాకుండా పార్టీ కోసం క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా పనిచేసిన నేతలకే అవకాశాలు దక్కుతాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

నామినేటెడ్ పదవుల్లో రాష్ట్రస్థాయితో పాటు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో పలు పదవులున్నాయి. మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, ఆలయాల కమిటీలు, గ్రంథాలయ కమిటీలతో పాటు మరికొన్ని సైతం ఉన్నాయి. ఇందులో మార్కెట్లు, ఆలయాల కమిటీ, గ్రంథాలయ కమిటీ చైర్మన్ల పదవులకు ఎక్కువగా డిమాండ్ ఉంది. ఈ పదవులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశావహులకు లింక్ చేసే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో ఇప్పటికే కొన్ని మార్కెట్ కమిటీలు, ఆలయాల కమిటీలు భర్తీ కావడం, మరికొన్ని పెండింగ్‌లో ఉండడం వంటి పరిస్థితులు ఉన్నాయి. దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలకు పాలకవర్గాల నియామకాల ప్రక్రియ ముందుకు వెళ్లడం లేదన్న అభిప్రాయాలున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల ప్రభావం సైతం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. నామినేటెడ్ పదవుల భర్తీ ఎప్పుడు ఉంటుందో...తమను పదవులు ఎప్పుడు వరిస్తాయోనని ద్వితీయ శ్రేణి కాంగ్రెస్ నాయకులు ఎదురుచూపులతో గడుపుతున్నారు.

# హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు

**జిల్లా వ్యాప్తంగా కదిలిన అధికార యంత్రాంగం**

**విద్యార్థుల నిరసనలపై విశేష స్పందన**

**వసతి గృహాల్లో వసతుల తీరును అణువణువు పరిశీలన**

**ఏ లోపమూ ఉండకూడని స్టిందికి ఆదేశం**

**దోమ, జులై 16, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు.బుదవారం నాడు దోమ మండల కేంద్రములోని షేడ్యుల్ కులాల బాలుర వసతి గృహం,కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగ కలెక్టర్ తరగతి గదులను, డార్మెంటరీని, మరుగు దొడ్లను, వంటగదులను, బియ్యం నాణ్యతను పరిశీలించారు. వసతి గృహాల్లో తాజా కూరగాయలను వాడాలని మెనూ ప్రకారం భోజనం పెట్టాలని వార్డెలను ఆదేశించారు. 10 వతరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సంవత్స రము బాగా చదివి వందశాతం మార్కులు సాదించాలని సూచించారు. వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయా, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, పుస్తకాలు బట్టలు వచ్చాయా, అని విద్యార్తులను అడిగి తెలుసుకున్నారు. సమయానికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారా, ఏవైన సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని, స్టోర్ రూమును, వంటసామాగ్రిని, మెనూ చార్టును పరిశీలించి కొత్త మెనూ ప్రకారం పిల్లలకు బోజనం పెట్టాలని వార్డెలను హెచ్చరించారు. ఈ కార్యక్రమములో తహసిల్‌దార్ గోవిందమ్మ, ఎంఇఓ వెంకట్, డిప్యూటి తహసిల్‌దార్ నర్సిములు, యంపిడిఓ గ్యామా, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వార్డెన్‌లు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గీత, పాల్గొన్నారు.



దోమలో వసతి గృహాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



రెవె న్యూ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

### విద్యార్థులను కష్టపెడితే

## సహించేది లేదు

**రోజూ తాజా కూరగాయలు వండండి**

**నాణ్యమైన భోజనం అందించాలి**

**అధికారులకు కలెక్టర్ ప్రతీక్ జైన్ వార్నింగ్**

**కుల్కచర్ల, జులై 16, ప్రభాతవార్త :** పాఠశాలలు హాస్టల్లో విద్యార్థులు అసౌకర్యానికి గురైతే సహించేది లేదని ప్రభుత్వ నిబంధనల ప్రకారం మె నూ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయం, తాహసిల్దార్ కార్యాలయంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టిందని ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్య ను బోధించాలని ఆయన సూచించారు. హాస్టల్లో కలెక్టర్ తరగతి గదులు, డార్మెటరీ, మరుగుదొడ్లు, వంట గదుల ను పరిశీలించి బియ్యం నాణ్యతల ు పరిశీలించారు. ప్రతి నిత్యం తాజా కూరగాయలు వాడాలని మె నూ ప్రకారం భోజనం పెట్టాలని ఉపాధ్యాయులకు ఆయన ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ, మీకు అన్ని సౌకర్యాలు ఉన్నాయా మె నూ ప్రకారం భోజనం పెడుతున్నారా ఏవైనా సమస్యలు ఉన్నాయా బుక్స్ యూనిఫామ్స్ వచ్చాయా వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రత్యేక ఇంగ్లీష్ తరగతులు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని పిల్లలకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని ఆదేశిం చారు. విద్యార్థుల ను ఉద్దేశించి మాట్లాడుతూ చదువే మార్గదర్శకంగా తీసుకోవాలని ఉత్తమ విలువలతో కూడిన విద్య ను అభ్యసించి ఉన్నత స్థాయిలో ఉంటే ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు సొంత గ్రామానికి కూడా మంచి పేరు వస్తుందని ఆయన అన్నారు. అనంతరం ఆయన తహసిల్దార్ కార్యాలయం ు సందర్శించారు. రెవె న్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల ు పరిశీలించి ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తుల ు ఆన్లైన్లో చెక్ చేసి పంపించారు, మ్యూట్యుయేషన్, డిఎస్ పెండింగ్ ఎన్ని పూర్తి చేశారని వివరాలు తెలుసుకున్నారు. ప్రతిరోజు టార్గెట్ ప్రకారం దరఖాస్తుల ు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

**కలెక్టర్ ఉపాధ్యాయుడైన వేళ....**

.కుల్కచర్ల మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక పర్యటన చేసిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఉపాధ్యాయుడిలా మారి పోయారు. విద్యార్థులకు ఇంగ్లీష్ సబ్జెక్ట్ బోధించారు. అనంతరం విద్యార్థుల ు పాఠ్యాంశాన్ని చదివించారు. ఉపాధ్యాయులకు ఇంగ్లీష్ పట్ల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రత్యేక తరగతులు తీసుకొని ఇంగ్లీషులో ప్రతి ఒక్క విద్యార్థి రాటుదేలేలా ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హబీబ్ అహ్మద్, తహసిల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీడీవో రామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కెజిబివి పాఠశాలలో బియ్యం నాణ్యత ను పరిశీలిస్తున్న కలెక్టర్

## పాత్రికేయుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా నాయకుల డిమాండ్**

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూలై 16 :** షాద్‌నగర్ సీనియర్ జర్నలిస్టు కేపీ వాహనాన్ని ధ్వంసం చేసిన ఘటనలో రంగారెడ్డి జిల్లా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యుజేఎఫ్) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రైతు కాలనీలోని కేపీ గృహానికి వెళ్లిన ఫెడరేషన్ జిల్లా నాయకులు వార్త జిల్లా బ్యూరో రఘు, సూర్య జిల్లా బ్యూరో గణేష్, నవతెలంగాణ బ్యూరో సైదులు స్థానిక జర్నలిస్టులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులపై రోజు రోజుకు అధికమవుతున్న దాడులు, దౌర్జన్యాలు నశించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ విజయ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు రఘుపతి, గణేష్, సైదులు మాట్లాడుతూ సమాజంలో కలం ద్వారా తన గళాన్ని వినిపిస్తూ సమాచార రంగంలో నాణ్యమైన ఎన్నో సేవలు అందిస్తున్న కేపీ పట్ల దుండుగులు ఇలాంటి చర్యలకు పాల్పడడం సమంజసం కాదన్నారు. ఈ సంఘటనను జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలతో చర్చించి యూనియన్ పరంగా కేపీకి మద్దతు తెలియజేస్తామన్నారు.

ఫెడరేషన్ నాయకులు లక్కాకుల రమేష్ కుమార్, నరసింహ్మారెడ్డి, నరేష్, రాకేష్, సాయినాథ్ రెడ్డి, భైరమోని మహేష్, బూర్గుల రమేష్, కృష్ణ, జగన్, భాస్కర్, రవితేజ, నరేందర్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా జర్నలిస్టు కేపీ వాహ నంపై దాడి చేసిన నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని సీనియర్ నాయకుడు నాగిళ్ల గోపాల్ గుప్తా, పటోళ్ల వెంకటేశ్వర రెడ్డిలు డిమాండ్ చేశారు.

**జర్నలిస్టులకు అండగా బీసీసేన**

మీడియాపై దౌర్జన్యాలు సహించబోమని ముదిరాజ్ సంఘం నాయకులు అంచె రాములు, మంగ మధు హెచ్చరించారు. ఇలాంటి దారుణాలను బీసీసేన ఎండ గడుతుందని బీసీసేన నాయకులు సుధాకర్, మేకల వెంకటేష్‌లు ప్రకటించారు. పోలీసులు వెంటనే దాడికి పాల్పడ్డ వారిని పట్టపరంగా శిక్షించాలని లేకపోతే ముదిరాజ్ సంఘం, బీసీసేనల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న టీడబ్ల్యుజేఎఫ్ నాయకులు

### ఫారెస్ట్ భూముల్లో

## రియల్ రోడ్డు

**ముడిమ్యాల అటవీ భూములు దర్జాగా కబ్జా**

**పట్టించుకోని ముడిమ్యాల అటవీశాఖ అధికారులు**

**చేవెళ్ల, జూలై 16, ప్రభాతవార్త :** అటవీ భూముల్లో చిన్న మొక్క పీకితే పరుగులు పెట్టె అటవీశాఖ అధికారులు కళ్లెదుటే ఎరకాల భూములు కబ్జాకుగురౌతున్న పట్టించుకోవడంలేదు. అటవీ భూముల పరిరక్షణ పర్యావరణ కోణంలో కూడ చాలా కీలకం. కాని అధికారులు మాత్రం అటవీ భూముల్లోంచి రియల్ ఎస్టేట్ వ్యాపారులు దర్జాగా రోడ్డు వెసిన పట్టించుకోకపోవడం విచిత్రం. భూములు కబ్జాకు గురైన పట్టించున్న పాపానపోవటంలేదన్న విమర్శలు బలంగా ఉన్నాయి.రైతులు తమ పంట పోలాల్లోకి ఆటవీ శాఖ భూముల్లోంచి వెల్తుతే అభ్యంతరం తెలిపిన అటవీశాఖ అధికారులు చేవెళ్ల -బీజాపూర్ జాతీయ రహదారి నుండి ముడిమ్యాల ఫారేస్ట్‌లోంచి రోడ్డు వెసుకుని వాహనాల రాకపోకలు చేస్తున్న సంబందిత అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నిస్తున్నారు. ముడిమ్యాల ఫారేస్ట్ నుండి రోడ్డు వెశారని ప్రతి నిత్యం అధికారులు అ రహదారి వెంట ప్రయాణిస్తునే ఉన్నారు కాని కబ్జాకు గురైన అటవీ భూములపై మాత్రం పెదవి విప్పడంలేదు. ముడిమ్యాల,మల్కాపూర్ పరిసర ప్రాంతాల్లో అటవీ భూములు కబ్జాకు గురౌతున్నాయి. అటవీభూముల్లోంచి ప్రైవేటు వ్యక్తులు రోడ్డు వెసుకుని దర్జాగా కబ్జా చేసిన సంబందిత అధికారులు పట్టించుకోవడంలేదు. పారేస్ట్ నుండి రోడ్డు వేయడంను కట్టడి చేయడంలో పూర్తిగా అటవీశాఖ అధికారులు విపలమయ్యరని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.జాతీయ రహదారి వెంట రోడ్డు వెసుకుని రియల్ వ్యాపారులు కబ్జాకు పాల్పడినట్లు కళ్లకు కనిపిస్తున్న సంబందిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకొవడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.




కేంద్ర మంత్రిని కలిసిన బిజెపి నాయకులు

## కేంద్ర సహాయ మంత్రిని కలిసిన బిజెపి శ్రేణులు

**హుస్నాబాద్ టౌన్, జూలై 16, ప్రభాతవార్త :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్‌ను బిజెపి పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు పార్టీ శ్రేణులతో పాటు హుస్నాబాద్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ సభ్యులతో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామివారి దేవాలయానికి ప్రహరీ గోడ నిర్మించడంతోపాటు పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పం దించినట్లు వారు వివరించారు. బండి సంజయ్‌ని కలిసినవారిలో వెంకటే శ్వరస్వామి దేవాలయ చైర్మెన్ వరియోగుల మురళి, ప్రధాన కార్యదర్శి అనంతస్వామి, కోశాధికారి శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

### మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

**హుస్నాబాద్ రూరల్, జూలై 16, ప్రభాతవార్త :** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ముందుకుసాగాలని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కోహెడ మండల నాయకులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నిక లకు కార్యకర్తలు సిద్దంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల విషయంలో విఫలమైందని వాటిని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ బిఆర్ఎస్ హయాంలో ప్రజల సంక్షేమం కోసం ప్రారంభించిన పథకాలను గురించి ప్రతీ ఊర్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కోహెడ మండల అధ్యక్షులు ఆవుల మహేందర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు


కప్పతల్లి ఆడుతున్న గ్రామస్థులు

**హుస్నాబాద్ రూరల్, జూలై 16, ప్రభాతవార్త :** మండలంలోని కూచన పల్లి గ్రామంలో వర్షాలు పడాలని కోరుకుంటూ గ్రామస్థులు కప్పతల్లి ఆటలు ఆడి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో మహిళలు, పురుషులు అని తేడా లేకుండా కప్పను రోలుకు కట్టుకుని ఊరేగింపుగా వెళ్లి నీళ్లు చల్లు కుంటూ వర్షాలు కురవాలని భగవంతులను వేడుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బంక చందు, గ్రామ అధ్యక్షులు రాజు, నాయ కులు వెన్న రాజు, పోలు సంపత్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ గుడి నిర్మాణానికి రూ. 47 లక్షలు మంజూరు


మంత్రులకు కృతజ్ఞతలు చెబుతున్న గ్రామస్థులు

**అక్కన్నపేట, జూలై 16, ప్రభాతవార్త :** మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో పోచమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి రూ. 47 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. బుధవారం ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు కృషిచేసిన ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖలకు గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు జేరిపోతుల అంజన్న, గ్రామ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సారయ్య, ముదిరాజ్ సంఘం సభ్యులు స్వామి, కుమార్, కనుకయ్య ఉన్నారు.

## నానో యూరియా, డిఏపి వాడకంపై రైతులకు అవగాహన

**జగదేవ్‌పూర్, జూలై 16 (ప్రభాతవార్త):** గుళికల రూపంలో ఉండే యూరియా, డిఏపిలకంటే నానో టెక్నాలజీతో తయారైన ద్రవరూప ఎరువు లతో రైతులకు మేలు జరుగుతుందని జగదేవ్‌పూర్ మండల వ్యవసా యాధికారి వసంతరావు అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్, అలిరాజపేట గ్రామాల రైతులకు నానో యూరియా, డిఏపి వల్ల కలిగే ప్రయోజనాలపై ఇఫ్కో కంపెనీ ప్రతినిధులతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ఏవో వసంతరావు మాట్లాడుతూ ఎక్కువ ఎరువులు వేస్తే ఎక్కువ దిగుబడి వస్తుందని అపోహతో రైతులు మోతాదుకు మించి ఎరువులను వాడుతూ అధికంగా పెట్టుబడి పెడుతూ పెట్టుబడి భారం పెంచుకుంటు న్నారని అన్నారు. అలాకాకుండా నానో టెక్నాలజీతో తయారుచేసిన ద్రవ రూప యూరియా, డిఏపిలను వాడడం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్ని పొందవచ్చని అన్నారు. డిఏపిని మోతాదుకు మించి వేయడం వల్ల మొక్క తీసుకోకపోగా మిగిలిన ఎరువు భూమిలో పేరుకుపోయి నేలలో ఆమ్లత్వం పెరగటం వల్ల పంట దిగుబడిపై ప్రభావం పడుతుందన్నారు. నానో ఎరువులను పంటలపై పిచికారి చేసుకోవడం వల్ల వివిధ దశల్లో అవసరమైన పోషకాలను నేరుగా ఆకుల ద్వారా అందించి అధిక దిగుబ పొందవచ్చు అని సూచించారు. యూరియా అతిగా వాడటం వల్ల నేల నిస్సారంగా మారడంతోపాటు మొక్కకు కావాల్సిన పోషకాలు సమతుల్యత దెబ్బతింటుందన్నారు. యూరియా అధిక వాడకంతో మొక్కల్లో శాఖీయ ఉత్పత్తి పెరిగి చీడపీడలు అధికంగా ఆశించి పంటలను నష్టపరుస్తాయని అన్నారు. సమావేశం ముగిసిన తర్వాత నానో యూరియాను పత్తిలో స్ప్రే చేసి క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో కంపెనీ ప్రతినిధి ఈశ్వర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారులు ఖలీల్, సాయిప్రసన్న, ఎరువుల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఓ వసంతరావు

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**పటాన్‌చెరు, జూలై 16, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో సమర్థులైన ఉపాధ్యాయులు ఉన్నారని, వారు విద్యార్థులకు ప్రాణ్యమైన విద్యను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం పటాన్ చెరు లోని గౌతమ్ నగర్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రం ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరు రిజిస్టర్, స్టోరూమ్ షోరూమ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని ప్రీ ప్రైమరీ విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రీ ప్రైమరీ విద్య ద్వారా ఆంగ్ల భాషపై విద్యార్థులకు పట్టువచ్చేలా చర్యలు తీసుకున్నది అన్నారు. ప్రాథమిక దశ నుండి ఆంగ్ల విద్యను బోధించడం ద్వారా కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు.


గౌతమ్ నగర్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంను తనిఖీ చేస్తున్న కలెక్టర్

ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల లోవిద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజ, పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించాలి

### సిద్దిపేట సిపి డా. అనురాధ

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి/కోహెడ, జూలై 16, ప్రభాతవార్త :** ప్రజల రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సీపీ డాక్టర్ అనురాధ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని త్రీటౌన్ పోలీసు స్టేషన్‌ను సంద ర్శించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ రికార్డు, రైటర్ రూమ్ పరిశీలించి పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం అమె మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వ యంతో విధులు నిర్వహించాలని.. ఫిర్యాదుదారు లతో మర్యాదగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌తో పాటు ఇసుక,జూదంపై ప్రత్యేక నిఘా పెంచాలన్నారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. పోలీసుస్టేషన్ రికార్డు,సిసిటిఎన్ఎస్ డాటా అప్‌డేట్ ఉన్నందన


సిద్దిపేటలోని త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ డా॥అనురాధ

అధికారులను, సిబ్బందిని అభినందించారు. కార్యక్ర మంలో సీఐ విద్యాసాగర్, ఎస్‌బి,సిసిఆర్బి, రిజర్వ్ సిఐలు కిరణ్, శ్రీధర్‌గౌడ్, రామకృష్ణ, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

**కోహెడలో...**

కోహెడలోని పోలీసు స్టేషన్‌ను సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధ బుధవారం ఆకస్మికంగా సంద ర్శించారు. ఈ సందర్భంగా రిసెప్షన్‌లో ఏ విధంగా దరఖాస్తులు నమోదు చేస్తున్నారు..ఏ విధంగా డిస్పోజల్ చేస్తున్నారని తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలను,సీజ్ చేసిన వాహనాలు, రిసెప్షన్ రికార్డు, రైటర్ రూంను పరి శీలించారు. ఆమె వెంట ఏఆర్ అడిషనల్ డిసిపి సుభాష్‌చంద్రబోస్, హుస్నాబాద్ ఏసిపి సదానందం, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ అభిలాష్ ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఆంక్షలు సరికాదు

### ఎంపి రఘునందన్‌రావు

**గజ్వేల్, జూలై 16 (ప్రభాతవార్త):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంది రమ్మ ఇండ్లపై ఆంక్షలు పెడుతూ లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేయడం మంచిదికాదని మెదక్ ఎంపి రఘునందన్‌రావు విమర్శించారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో వివిధ పార్టీల నుండి బిజెపిలో చేరిన వారికి ఎంపి రఘునందన్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60గజాలలో మాత్రమే ఇల్లు ఉండాలని, పైన ఇంకో ఇల్లు ఉండకూడదన్న కాంగ్రెస్ పార్టీ విధానాన్ని తప్పుబట్టారు. కేంద్రంలో నరేంద్రమోడి ఇందిరమ్మ ఇండ్ల కోసం నిధులు మంజూరు చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులకే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నారని విమర్శిం చారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం గజ్వేల్‌కు రైల్వే స్టేషన్ నిర్మాణానికి ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదని, బిజెపి ప్రభుత్వమే మొత్తం నిధులను సమకూర్చి రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసిందన్నారు. సిద్దిపేట, గజ్వేల్ పట్టణాల్లో అండర్ డ్రైనేజీ నిర్మా ణానికి కేంద్రం నిధులు మంజూరు చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మార్పును కోరిన విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అదే


బిజెపిలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎంపి రఘునందన్‌రావు

మార్పు కోసం ఎదిరిచూస్తున్నారన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు అన్ని గ్రామాల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని, అందుకోసం బిజెపి కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడు తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళాల లన్నారు. రాష్ట్ర ప్రజలంతా బిజెపివైపే ఉన్నారని, బిజెపి బలోపేతం కోసం అందరు కృషి చేయాల న్నారు. బిజెపిలో చేరిన వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సి పల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ఎల్లు రాం రెడ్డి, నలగామ శ్రీనివాస్, ఏర్పుల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభునయలు సింగం సత్తయ్య, మాజీ సర్పంచ్ నత్తి మల్లేశం, సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, వివిధ మండలాల అధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్, సంపత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటేష్ గౌడ్, వడ్డేపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**నిజాంపేట్, జూలై 14, ప్రభాతవార్త:** నిజాంపేట మండలం నాగదరగ్రామం ఎర్రకుంటతండాకు చెందిన కేతా వత్ గమినిభాయి, భర్త అమృనాయక్ అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ దవాఖానకు చికిత్స నిమిత్తం వెళ్ళగా వారికి ఎక్కువ మొత్తంలో డబ్బులు ఖర్చు అవుతాయని తెలుసుకుని వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2,50,000 మంజూరు చేయించి మంజూరు పత్రాన్ని నారాయణఖేడ్‌లో వారి కుటుంబ సభ్యులకు అందజేసిన మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డితోపాటుగా నారాయణఖేడ్ నియోజకవర్గ కూర్మ సంఘం అధ్యక్షుడు ప్రభుయాదవ్, నియోజకవర్గ కూర్మసంఘం ఉపాధ్య క్షులు గొండ, నారాయణఖేడ్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నగేష్, పట్టణ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పరశురామ్, కౌన్సిలర్ విఠల్, మానూర్ మండల బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు విఠల్‌రావు, నాగలగిద్ద మండల బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు పండరి, నాయకులు లాయక్ మచ్చేందర్, తదితరులు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి త్రిశ ఆర్థిక సహాయం

**చౌటకూరు, జూలై 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కోదూర్ గ్రామానికి చెందిన నిరుపేద బీచం లక్ష్మీ అనారోగ్యంతో మృతిచెందినట్లు కాంగ్రెస్ నాయకులు ఆత్మూరి రవీందర్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ తనయ త్రిశ దామోదర్ దృష్టికి తీసుకుపోగా, చలించిన త్రిశ దామోదర్ మృతు రాలి కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం చేయాలని నాయకుడికి డబ్బులు పంపించగా నాయకుడు లక్ష్మీ నివాసానికి చేరుకుని మృతురాలిభర్త బీచం మల్లేశంకు అందచేశారు.

ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులూ ఆత్మూరి రమేష్, నవీన్, పాపయ్య, మొగులయ్య శివకోటి తదితరులు పాల్గొన్నారు.

# కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు.. పొంచి ఉన్న ప్రమాదాలు

### పట్టించుకోని విద్యుత్ అధికారులు

**టేక్మాల్, జూలై 15, ప్రభాతవార్త** విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం అంతా ఇంతా కాదు.. ప్రాణాలు పోతేగాని పట్టించుకోం అంటూ వాళ్ల నిర్లక్ష్యాన్ని చూపుతున్న వైనం కళ్లకు కట్టినట్టు కనబడుతోంది. కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు, శిథిలమైన స్తంభాలు నేలకు ఒరిగేందుకు సిద్ధం ఉన్న విద్యుత్ స్తంభాలతో కూడిన వైర్లు ఇలా ఎన్ని ఉన్నా చూసి చూడనట్టు వదిలేస్తున్నారు. శనివారం రాత్రి బొడ్మట్ పల్లి శివారులో ముద్దపురం నాగప్పకు చెందిన ఓ గేదే కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృత్యువాత పడింది. దీంతో లక్ష రూపాయాల నష్టం వాటినట్లు ఆ రైతు చెప్పాడు. ఇలాంటివి మండలంలో చాలనే ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలవుతూ మూగజీవాలు సైతం మృత్యుగోషబడుతున్న సంఘటనలు ఉన్నాయి. టేక్మాల్ మండలంలో హసన్‌మహ్మద్‌పల్లి చెరువుకట్ట ఉన్న ట్రాన్స్‌పార్మర్లు, కట్ట కింద ఉన్న స్తంబం శిథిలమై ఉంది. టేక్మాల్ శివారులో మరోకటి కంచె లేకుండా ఉంది. మెరున్‌కుంటలో పాఠశాల సమీపం లో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అక్కడ ప్రతి నిత్యం విద్యార్థులు, తండావాసులు నడుస్తుంటారు.


మెరుగున్‌కుంట పాఠశాల వద్ద కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

ఈ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉంది. ప్రధాన రహదారులు, జనసంచారం ఎక్కువ గా ఉన్న ప్రదేశాల్లో విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన పలు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె ఏర్పాటు చేయడం మరిచారు. దీంతో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. జన సంచారం, వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉన్న రోడ్ల పక్కన ఉన్న కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లకు వాహనాలు అదుపు తప్పి తగిలితే పెనుప్రమాదం సంభవించే అవకాశం ఉంది.

దీనిపై సంబంధిత అధికారులు తక్షణం స్పందించి ఎలాంటి ప్రమా దాలు చోటుచేసుకోకముందే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచెలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతు న్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రమాదా లను గుర్తించి శిథిలమైన స్తంభాలను ట్రాన్స్‌ఫార్మర్ల కు కంచెలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టా లని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కొడకండ్ల కెనాల్‌వద్ద నిరసన తెలుపున్న బిఆర్ఎస్ నాయకులు, రైతులు

## మల్లన్నసాగర్ నుంచి నీటిని విడుదల చేయాలి

### -కొడకండ్ల కెనాల్ వద్ద రైతులతో కలిసి నిరసన

### -బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, జూలై 16 (ప్రభాతవార్త):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎడారిగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని పది సంవత్సరాల కెసిఆర్ పాలనలో సస్యశ్యామలంగా మారిందని గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ మండలంలోని కొడకండ్ల కెనాల్ వద్ద మల్లన్నసాగర్ నుండి కొండపోచమ్మ సాగర్‌లోకి, కూడవెల్లి వాగులోకి, హల్దీ వాగులోకి, సంగారెడ్డి, రామాయంపేట, కామారెడ్డి, జగదేవ్‌పూర్ కెనాల్‌లలోకి నీటిని విడుదల చేయాలని గజ్వేల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు పడకున్నా, కరువు వచ్చినా సరే రైతులు దుక్కులు దున్నుకోవాలన్నా వర్షాల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఉండేదని, కెసిఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయకసాగర్ ప్రాజెక్టులు నిర్మించి రైతులకు సాగునీరును పుష్కలంగా అందించారన్నారు. నేడు రైతులు నార్లు పోసుకొని వర్షాల కోసం చూస్తూ అల్లాడుతున్నా, పొలాలు ఎండుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. గోదావరి పరవళ్లు పెడుతున్నా, లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలో వృధాగా పోతున్నా కన్నెపల్లి దగ్గర పంపులను విడుదల చేయకపోవడంతో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లు నింపకుండా రైతుల జీవితాలతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెలగాటమాడుతుందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుపై కక్షతో, బిఆర్ఎస్‌పై అక్కసుతో రైతుల నోట్లో మట్టి కొడుతూ రైతులను ఆగం చేస్తున్నారన్నారు. కొండపోచమ్మ సాగర్ నుండి వర్గల్ కెనాల్ నుండి హల్దీ వాగులోకి, రామాయంపేట కెనాల్ సాగునీరును వదిలితే ఎస్ఆర్ఎస్‌పి వరకు ఎకరాలకు సాగునీరు అం దించవచ్చన్నారు. వెంటనే మల్లన్నసాగర్ నుండి కాలువలకు నీటిని విడుదల చేయాలని, లేనిపక్షంలో జిల్లా నుండి రైతులను తరలించి పెద్దఎత్తున నిరసన చేస్తామని హెచ్చరించారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ నుండి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు సాగునీరు అందించకుండా దొంగల్లాగా నల్లగొండ జిల్లాకు గోదావరి జలాలు తరలించి ఇక్కడి ప్రాంత వాసుల పంటలను ఎండబెడుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్, సీనియర్ నాయకులు పండరి రవీందర్‌రావు, భాస్కర్, మాజీ జెడ్‌పిటిసి బొల్లారం ఎల్లయ్య, మాజీ ఎంపిటిసి గొడుగు స్వామి, మాజీ సర్పంలు శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, బాల్‌చంద్రం, మద్ది రాజిరెడ్డి, అబ్దుల్, పాల రమేష్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**సిద్దిపేట అర్బన్, జూలై 16, ప్రభాతవార్త :** అనారోగ్యంతో బాధనడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్సపొందిన పలువురు పేదలకు సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం పేదల వరం అని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు)తో కలిసి నియోజకవర్గంలోని 80 మంది లబ్దిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలీం, యాదగిరి, ఎల్లం యాదవ్, పూజల గోపికృష్ణ, మహేందర్, సతీష్, అంజయ్య, గయాజుద్దీన్, శంకర్, బిక్షపతి, మహేందర్, అంజిరెడ్డి, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**పేదల సొంత ఇంటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం...**

పేదల సొంత ఇంటి కలను సాకారం చేస్తున్న ఘనత కాంగ్రెస్ సర్కార్‌కే దక్కుతుందని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరి కృష్ణ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని పొన్నాల గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగు తుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్దిదారులు ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వమే ఉచితంగా ఇసుకను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## టాటా ఏసి యూనియన్ మండల అధ్యక్షుడిగా శరత్

**కోహెడ, జూలై 16, ప్రభాతవార్త :** టాటా ఎసి యూనియన్ మండల అధ్యక్షుడిగా మెట్టుబండ గ్రామానికి చెందిన దానవేని శరత్ మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికకాగా సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా కూరెళ్ల గ్రామానికి చెందిన గద్దల రమేష్‌లను సంఘం సభ్యులు బుధవారం రోజున ఎన్నుకున్నారు. ఈనేపధ్యంలో గౌరవ అధ్యక్షులుగా తేలు యాదగిరి, ఉపాధ్యక్షులుగా తోట వెంకన్న, లెంకల రమేష్‌లతో పాటు సభ్యులుగా శ్రీకాంత్, కలకుంట్ల సంపత్, అన్నబోయిన సాయి, సకినాల మల్లేశం, అంజిరెడ్డి, అభిలాష్‌లతో పాటు తదితరులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

## గ్రామ పంచాయతీకి వైకుంఠ రథం అందజేత

**మిరుదొడ్డి, జూలై 16, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రజల సౌకర్యార్థం దాతల సహకారంతో వైకుంఠ రథాన్ని బుధవారం గ్రామ పంచాయతీకి అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మద్దెల రాజు, శివ లింగం యాదగిరి, భూపతి మాట్లాడుతూ మిరుదొడ్డిలో ఎవరైనా చనిపోతే వైకుంఠ రథం కోసం దుబ్బాక మున్సిపాలిటీ వారిని ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. వైకుంఠ రథం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని దాతల సహకారంతో వైకుంఠ రథాన్ని గ్రామ పంచాయతీకి అందజేయడం జరిగిందన్నారు. వైకుంఠ రథం అందుబాటులోకి తీసుకరావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ మద్దెల రాజు మిత్ర బృందాన్ని అభినందించారు.

## విద్యాధరి క్షేత్రంలో దిలీప్‌రెడ్డి ప్రత్యేక పూజలు


సరస్వతి అమ్మవారిని దర్శించుకుంటున్న దిలీప్‌రెడ్డి

**వర్గల్, జులై 16 (ప్రభాతవార్త):** ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో సరస్వతి అమ్మవారిని బుధవారం సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దిలీప్‌రెడ్డి మాట్లా డుతూ చదువుల తల్లి శ్రీ విద్యా సరస్వతి క్షేత్ర మహత్యం చాలా గొప్పదని, అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందచేసిన మాజీ ఎమ్మెల్యే

**మనూర్, జూలై 16, ప్రభాతవార్త:** మండలపరిధిలోని ఎల్గోయిగ్రామానికి చెందిన సంతోష్‌రావు అనారో గ్యానికి గురికావడంతో కార్పొరేట్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందు కునేందుకు బుధవారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి 15 వేల రూపాయల సిఎఆర్ఎఫ్ చెక్కును అందచేశారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు విఠల్‌రావుపాటిల్, పండరి, మున్సిపల్ వైస్ చైర్మన్ పరశురాం, కురుమసంఘం తాలుకా అధ్యక్షులు ప్రభాకర్‌కురుమ, ఉపా ధ్యక్షులు మల్గొండ, మాజీ కౌన్సిలర్ విఠల్, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సేట్, మాజీకో-ఆప్షన్ సభ్యులు లయాక్, మచ్చేందర్, నాగరాజు, గుండప్ప, పండరి తదితరులు పాల్గొన్నారు.

## తాండూరులో గంజాయి చాక్లెట్లు!

### పీచు మిఠాయిల మాటున విక్రయాలు

**తాండూరు, జూలై 16, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా తాండూరులో గంజాయి చాక్లెట్ల కలకలం రేగింది. యూపీకి చెందిన ఓ వ్యక్తి తాండూరులో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకొని 45గంజాయి చాక్లెట్లను స్వాదీనం చేసుకున్నారు. ఇందుకు సంబందించి వివరాలను డిఎస్పీ బాలకృష్ణారెడ్డి మీడియాకు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఔరైయా జిల్లా ఫతేపూర్ బైని పోస్ట్, మున్సిపూర్ గ్రామానికి చెందిన దినేష్ నాయక్ తాండూరు పట్టణంలోని పీచుమిఠాయిలు విక్రయిస్తుంటాడు. బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో నమ్మదగిన సమాచారం మేరకు పట్టణ ఎస్ఐ అబ్దుల్ సాజిద్ సిబ్బందితో కలిసి పట్టణంలోని గొల్లచెరువు ప్రాతంలో దినేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అతని వద్ద 45గంజాయి చాక్లెట్లు లభించినట్లు తెలిపారు. గంజాయి చాక్లెట్లను తన స్వగ్రామం నుండి తీసుకువచ్చి తాండూరులో విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసిందని వివరించారు. నేరస్తున్ని అదుపులోకి తీసుకొని గంజాయి చాక్లెట్లను స్వాదీనం చేసుకొని నిందితునిపై ఎన్‌డిపిఎస్ చట్ట ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని డిఎస్పీ వెల్లడించారు.

## ఆర్‌టిసి బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షునిగా జివికె యాదవ్

**శామీర్‌పేట, జూలై 16, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఆర్టీసి బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా శామీర్‌పేట మండలంలోని తుర్క పల్లి గ్రామానికి చెందిన జి.వినోద్‌కుమార్‌యాదవ్ (జివికె యాదవ్) ఎన్నికైనట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేశ్ ప్రకటించారు. బుధవారం రాష్ట్ర కమిటీని ఎన్నుకోవటం జరిగినట్లు దీనిలో రాష్ట్ర నూతన అధ్యక్షులుగా జివికె యాదవ్‌ను ఎన్నుకోవటం జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన అధ్యక్షులు జి.వినోద్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఆర్టీసి బహుజన వర్కర్ యూనియన్ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకోవటం జరిగిందని, రాష్ట్ర అధ్యక్షులుగా తనకు అవకాశం కల్పించినందుకు దన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర కమిటీ విస్తరణ, చేర్పులు,మార్పులు చేసుకోవటం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు.

## నేడు మంత్రి శ్రీధర్‌బాబు రాక

**శామీర్‌పేట, జూలై 16, ప్రభాతవార్త:** శామీర్‌పేట మండల స్థాయిలో మహిళా శక్తి సంబరాలు,సమావేశం గురువారం ఉదయం జరుగుతుందని, దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ఛీఫ్ విప్ ఎమ్మెల్సీ పి.మహేందర్‌రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి,పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నందున అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్దం చేసింది. శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ చౌరస్తా వద్ద గల శుభం పంక్షన్‌హాల్‌లో మహిళా శక్తి సమావేశం ఉదయం 10.30గంటలకు జరుగుతుందని అన్నారు. దీనికి సంబంధించి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనే విధంగ సంబంధిత అధికారులు ఏర్పాట్లు సిద్దం చేస్తున్నారు.

## డిప్యుటేషన్లను రద్దు చేయాలని వనతిపత్రం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూలై 16:** ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మౌఖిక డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలని ఫరూఖ్‌నగర్ మండల టీఎస్ యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల డిప్యుటేషన్, సర్దుబాట్ల అంశాలకు సంబంధించి మండల ఎంఈవో మనోహర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డిప్యుటేషన్ల ద్వారా విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, దీనిని అరికట్టాలని వారు కోరారు. జడ్పీహెచ్ఎస్ వెలిజర్ల పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల ఉత్తర్వులను రద్దు చేయాలని, అక్కడి విద్యార్థులకు జరుగుతున్న నష్టాన్ని నివారించాలని వారు కోరారు. ఉపాధ్యాయుల సర్దుబాటును విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తికి తగిన విధంగా సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ నేతలు ఎన్.నరసింహులు, బి.సత్యం, ఎస్.మహేష్, కృష్ణ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రద్ధగా చదివితేనే భవిష్యత్తులో ఉన్నత స్థానం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూలై 16 :** విద్యార్థులు శ్రద్ధగా చదివి భవితవ్యాన్ని గెలవాలని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ శోభారాణి అన్నారు. మండల పరిధిలోని రాయికల్ గ్రామ సమీపంలో గల మూన్ రే ఫార్మాసిటికల్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాతీయ సదస్సు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల నిర్వాహకులు ఉపకార వేతనాలు సమయానుకూలంగా రాకపోయినా విద్యార్థుల చదువులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని సదుపాయాలు కల్పించాలని రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు తమ మేధస్సుకు పదునుపెట్టి తాము ఎన్నుకున్న రంగంలో విజయాలు అందుకోవాలని సూచించారు. అదేవిధంగా కళాశాల చైర్మన్‌న పర్వత్ రెడ్డి మాట్లాడుతూ 2007లో 60 మంది విద్యార్థులతో ఈ కళాశాల ప్రారంభమై, విద్య విషయంలో గానీ, సదుపాయాల విషయంలో గానీ రాష్ట్రంలో టాప్ టెన్‌లో తమ కళాశాల నిలిచిందన్నారు. త్వరలోనే కళాశాలలో ఆర్ఎన్‌పీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతంలో 200 నుండి 300 వరకు పరిశ్రమలు ఉన్నాయని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు ఈ ప్రాంతంలోనే ఉద్యోగాలు దొరికే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, డైరెక్టర్ సాయికృష్ణ, అధ్యాపక బృందం, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ శోభారాణిని సన్మానిస్తున్న దృశ్యం

## పేద ప్రజలకు సిఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిది

**తలకొండపల్లి జూలై 16, ప్రభాతవార్త:** నిరుపేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సీఎం రిలీఫ్ ఫండ్ పథకం వరం లాంటిదని అమంగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకటరెడ్డి అన్నారు. బుధవారం నాడు తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి చెందిన మల్లి కేడి ఈశ్వరి బాయికి మంజూరైన 45,500 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం మల్లికేడి ఈశ్వరి బాయి భర్త అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స జరిపించారు. నిరుపేద రాలైన ఈమెకు పెద్ద పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు కావడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ లు నరసింహ, అజీజ్ మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు హారిఫ్, నాయకులు రాజు కృష్ణయ్య గౌస్ గౌస్ తదితరులున్నారు తదితరులున్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి జైలు

**మేడ్చల్, జూలై 16. ప్రభాతవార్త :** మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి మేడ్చల్ కోర్టు 4 రోజుల జైలు శిక్ష విదిస్తూ తీర్పు ఇచ్చింది. మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్‌లో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని కోర్టుకు తలరించారు. మేడ్చల్ మున్సిపాలిటీలోని అత్వెల్లిలో గల ఏడో మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి వారిని విచారించి 4 రోజుల జైలు శిక్ష విదిస్తూ తీర్పు ఇచ్చారు.

## ఐఐటీ ర్యాంకర్‌కు అభినందన

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూలై16 :** ఐఐటీలో ర్యాంకు సాధించిన కిషన్‌నగర్ గ్రామానికి చెందిన వైష్ణవిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్యలు వేర్వేరుగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్ల చదువు అవనికి వెలుగు అని, ఆడపిల్లలు పట్టుదలతో, ఓపికతో చదివితే విజయం మీ సొంతమవుతుందని అన్నారు. ప్రధానమంత్రి కలలుగన్న బేటీ బచావో బేటీ పడావో నినాదం వైష్ణవి లాంటి బాలికలలో స్ఫూర్తిని నింపిందన్నారు. భవిష్యత్తులో వైష్ణవి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, చేగు సుధాకరన, చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, అత్తాపూర్ మహేందర్ రెడ్డి, విఠ్యాల నర్సింలు, కావలి ఆంజనేయులు, బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల సురేష్, బీజేపీ రాష్ట్ర సభ్యుడు వంశీకృష్ణ, వెంకనోల వెంకటేష్, నరసింహ్మా మాదిగ, శివ, బొక్క కృష్ణ, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నివారణపై ప్రజా చైతన్యం రావాలి

### మున్సిపల్ కమిషనర్ ఎంఎన్‌ఆర్ జ్యోతి

శామీర్‌పేట, జూలై 16, ప్రభాతవార్త : శామీర్‌పేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో వనమహోత్సవ కార్యక్రమం జరిగింది. బుధవారం శామీర్‌పేటలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తూంకుంట మున్సిపాల్టీ 100రోజుల పారిశుధ్య కార్యక్రమం సందర్భంగా వనమహోత్సవాన్ని నిర్వహించి మున్సిపల్ కమిషనర్ ఎంఎన్‌ఆర్ జ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్, అధ్యాపకులు పాల్గొని ప్రాంగణంలో మొక్కలు నాటారు. అదే విధంగా విద్యార్థులకు ఘనవ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ రహిత సమాజం అనే అంశాలపై వ్యాసరచన, డ్రాయింగ్ పేయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఎంఎన్‌ఆర్ జ్యోతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మున్సిపాల్టీలలో వంద రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని దీనిలో భాగంగానే వనమహోత్సవాన్ని జరుపుకోవటం జరుగుతుందన్నారు. తడి, పొడి చెత్తపై పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలను చైతన్యం చేయాల్సి ఉందని, ప్లాస్టిక్ నివారణకు ప్రజలను చైతన్యం చేయాల్సి ఉందన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో, కళాశాలలో ప్లాస్టిక్ ఫ్రీ విధానాన్ని పాటించాలని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరసరాల పరిశుభ్రతపై కూడ దృష్టి సారించాలన్నారు. దీనిలో పాల్గొన్న కళాశాల ఎన్‌సిసి విద్యార్థులు మున్సిపల్ కమిషనర్ జ్యోతికి ముందుగా ఘనంగా స్వాగతం పలికారు. ఎన్‌సిసి విద్యార్థులు సుమారు వంద మంది మానవహారంతో నిలబడి అందరిని ఆకట్టుకున్నారు. ఈ వనమహోత్సవ కార్యక్రమంలో కళాశాలకు చెందిన సుమారు 450మంది వరకు విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని విద్యార్థినిలు ఉత్సాహంగా విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇస్రత్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ చేతన, అకాడమిక్ వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ స్రవంతి, ఎన్‌సిసి కోఆర్డినేటర్ శిల్పరాథోడ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిత, కల్చరల్ కోఆర్డినేటర్స్ ధనవేణి, అమతుల్, అధ్యాపకులు, విద్యార్థినిలు, ఎన్‌సిసి విద్యార్థినిలు, కళాశాల, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వనమహోత్సవం సందర్భంగా డిగ్రీ కాలేజీలో మొక్కలు నాటుతున్న కమిషనర్

## ఆకట్టుకున్న ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తుల ప్రదర్శన

**కొత్తూరు, ప్రభాతవార్త, జూలై16:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మేళా అట్టహాసంగా ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ బాతుల లావణ్య దేవేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని మేళాను ప్రారంభించారు. మేళాలో మహిళా సంఘాలు స్వయంగా తయారు చేసిన తినుబండారాలు, చేతి వృత్తిపరమైన వస్తువులు, గృహోపయోగ వస్తువులు ఆకట్టుకున్నాయి. ఈ ఉత్పత్తులు మహిళల ఆర్థిక స్వావలంబనకు చక్కటి ఉదాహరణగా నిలిచాయి. అనంతరం జన శిక్షణ సంస్థాన్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో కుట్టుమిషన్‌లో శిక్షణ పొందిన మహిళలకు మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య శిక్షణ పత్రాలు అందజేశారు. మహిళలు ఇలాంటి మేళాలను వేదికగా చేసుకొని తమ ప్రతిభను చాటాలని, స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.బాలాజీ, కౌన్సిలర్లు మాదారం నర్సింహ్మా, జె.సుదర్శన్ గౌడ్, సోమ్లా నాయక్, జిల్లా మెప్మా అసిస్టెంట్ కోఆర్డినేటర్ అశోక్, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ లక్ష్మీ, జనశిక్షణ సంస్థాన్ ప్రతినిధి గీత, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో బోరు ఏర్పాటు

**కొత్తూరు, ప్రభాతవార్త, (జూలై16) :** గ్రామాభివృద్ధే తన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మామిడి సిద్ధార్థ రెడ్డి మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. బుధవారం మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో నెలకొన్న నీటి సమస్యపై స్పందించిన ఆయన తన సొంత నిధులు రూ.1 లక్షతో బోరు వేయించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థుల నుండి కాలనీలో నీటి సమస్య ఉందని తెలుసుకున్న వెంటనే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలకే నాయకత్వం ఉండాలని, ఇది తన బాధ్యతగా భావిస్తానన్నారు. బోరులో నీరు పుష్కలంగా రావడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ సిద్ధార్థ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



బోరు వేయిస్తున్న కాంగ్రెస్ నాయకుడు సిద్ధార్థ రెడ్డి

## అక్రమంగా మైనింగ్‌ను ఆపండి

**వికారాబాద్, జూలై 16, ప్రభాతవార్త :** తమ పట్టా భూమిలో అక్రమంగా మైనింగ్ చేస్తున్న అక్రమార్కుల నుంచి తనను కాపాడి తనకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను బాధిత రైతు ఖలీల్ మొర పెట్టుకున్నారు. సర్పన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు ఖలీల్ భూమిలో అక్రమ మైనింగ్ విషయమై ఆయన బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 30, 31, 33 సర్వే నెంబర్‌లోని తన పట్టా భూమిలో కొందరు కాంగ్రెస్ నాయకులు ధౌర్జన్యంగా అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని, ఈ విషయమై ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

## ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

**దుద్యాల్, జూలై 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలోని 8వ వార్డులో పోచమ్మ ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. బుధవారం పోచమ్మ అమ్మ వారి విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. సోమవారం అమ్మవారి ఊరేగింపు, మంగళవారం హోమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా పనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## 108 వాహనంలో కాన్పు

**మేడ్చల్, జూలై 16. ప్రభాతవార్త :** అత్యవసర సమయంలో గాంధీకి తరలిస్తున్న ఓ గర్భవతికి పురుటి నొప్పులు రావడంతో 108 వాహనంలో డెలివరి చేశారు. మేడ్చల్‌కు సల్మా (20) డెలివరీ కోసం మేడ్చల్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేరింది. పురుటి నొప్పులు సమయంలో ఆమెకు బీపీ ఎక్కువ కావడంతో మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తున్నారు. కాగా మార్గమధ్యలో గుండ్లపోచంపల్లి వద్ద చేరుకోగానే ఆమె నొప్పులు ఎక్కువ కావడంతో ఆ వాహనంలోనె ఆమెకు 108 వాహన సిబ్బంది ఈఆర్‌సీపీ డాక్టర్ జగదీష్, ఆఎంటీ మల్లేషలు కాన్పు చేశారు. ఈ కాన్పులో ఆమెకు ఆడబిడ్డ పుట్టగా ఇద్దరిని నేరుగా గాంధీ ఆస్పత్రికి తరలించారు. తల్లీ బిడ్డా ఇద్దరు క్షేమంగా ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో బోనాలు

**కోట్‌పల్లి, జూలై 16, ప్రభాతవార్త;** కోట్‌పల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో బుధవారం నాడు పోచమ్మ, ఎల్లమ్మలకు బోనాలు పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పెద్ద ఎత్తున్న మహిళలు ఇంటి నుంచి బోనాలు తీసుకవచ్చి పోచమ్మ, ఎల్లమ్మలకు నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలో బోనాలను పోతురాజుల నృత్యాలు, డప్పు చప్పుళ్లతో మహిళలు నెత్తిన బోనం పెట్టుకుని పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాలకు భక్తులు చిన్నారులు పెద్దలు మొక్కులు తీర్చుకున్నారు.

## గ్రామస్థాయి నుంచి బిజెపి బలోపేతానికి కృషి

**తలకొండపల్లి, జూలై 16, ప్రభాతవార్త:** బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు ను బుధవారం నాడు కల్వకుర్తి తాలూకాకుచెందిన బిజెపి నాయకులు కలిశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెరుకూరి మణికంఠ, బిజెపి యువ మోర్చా జిల్లా నాయకులు ఇమ్మడి మహేష్ ఆధ్వర్యంలో రామచంద్రరావు కలిసి శాలువా బొకేతో ఘనంగా సన్మానించారు. ఇటీవల బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా రామచంద్రరావు ఎన్నిక కావడంతో మర్యాదపూర్వకంగా కలిసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారితో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గ్రామస్థాయి నుంచి బిజెపి బలోపేతానికి కృషి చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో బిజెపిని ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుక ప్రతి ఒక్క కార్యకర్త బాధ్యతతో పనిచేసి బిజెపి నీ బలోపేతం చేయాలని ఈ సందర్భంగా వారికి పలు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మణికంఠ, ఇమ్మడి మహేష్ , కిరణ్ తదితరులున్నారు.

## విద్యార్థులతో బండలు కడిగిస్తారా!

### మాజీ ఎమ్మెల్యే అనంద్ ఆగ్రహం

**మర్పల్లి జూలై 16 ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలో కస్తూరిబా గాంధీబాలికల ఆశ్రమ పాఠశాలలో సిరిపురం ఎస్సీ బాలుర వసతిగృహలను బుదవారం నాడు వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజి ఎమ్మెల్యే డా.మెతుకు అనంద్ సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో బండలు కడిగిస్తున్నారని, సరైన భోజనం ఇవ్వడంలేదని, ఈవార్డెన్ మాకు వద్దని విద్యార్థినీలు తెలిపారని ఆయన అన్నారు. సిఎం విద్యా వ్యవస్థను తనవద్ద పెట్టుకొని విద్యా వ్యవస్థను పట్టించుకోకుండా కమిషన్ల వ్యవస్థలను పట్టించుకుంటున్నారని, వసతి గృహాల్లో ఎంతో మంది విద్యార్థులకు ఎలుకలు, పాములు కరిసి, విషా ఆహారము తిని విద్యార్థులు మరణిస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఈప్పటి వరకు రాష్ట్రంలో 100 మందివరకు విద్యాలు మృతి చెందారని అన్నారు. విద్యావ్యవస్థ దారుణంగా మారిందని అన్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని అన్నారు. విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని, విద్యా వ్యవస్థపై సమీక్ష నిర్వహించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యాక్షులు శ్రీకాంత్ రెడ్డి గఫార్, మాజి జడ్పిటిసిమదుకర్ మాజిఎంపీపీ లలిత,మాజి ఉపాధ్యక్షులు మొహన్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి మదు,ఆశోక్, సోయల్, గౌస్, సంజీవరెడ్డి, రమేశ్, వెంకట్, శ్రీకాంత్ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.



విద్యార్థుల సమస్యలు తెలుకుంటున్న అనంద్

## అనంతరెడ్డి సేవలు చిరస్మరణీయం

**చేవెళ్ల, జూలై 16, ప్రభాతవార్త :** చేవెళ్ల గ్రామానికి చెందిన పెంజర్ల ఆనంతరెడ్డి సేవలు చిరస్మరణీయమని చేవెళ్ల మండల బిజెపి సీనియర్ నాయకుడు దేవర పాండురంగారెడ్డి అన్నారు. బుదవారం చేవెళ్ల గ్రామంలోని పోచమ్మ గుడి అవరణలో పెంజర్ల ఆనంతరెడ్డి స్వంత నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను ప్రారంబీంచారు. ఈ సందర్భంగా చేవెళ్ల మండల బిజెపి సీనియర్ నాయకుడు దేవర పాండురంగారెడ్డి మాట్లాడుతూ బోనాల సందర్భంగా పోచమ్మ గుడి చుట్టు బోనం ఎత్తుకుని తిరిగేందుకు మహిళలు ఎదుర్కోంటున్నారని గ్రహించిన అయన స్వంత నిధులతో సిసి రోడ్డు నిర్మించడం అభినందనీయమన్నారు. చేవెళ్ల పోచమ్మ గుడి వద్ద వసతులను కల్పించేందుకు ముందుకు వచ్చిన పెంజర్ల ఆనంతరెడ్డి మానవత్వంను చాటుకున్నారు. సేవా భావంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం హర్షనీయమన్నారు. మునుముందు ఇలాంటి కార్యక్రమాలు చేసేందుకు యువత ముందుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల బిజెపి అధ్యక్షుడు అత్తెల్లి ఆనంతరెడ్డి, యువనాయకులు డాక్టర్ మల్లారి వైభవ్‌రెడ్డి,నత్తి క్రిష్ణారెడ్డి,మంగలి రాజు, అల్లాడ రాంరెడ్డి, పెంజర్ల ఆనంతరెడ్డి, గాజులగూడెం శ్రీనివాస్‌రెడ్డి, బండారి శ్రీకాంత్‌రెడ్డి, జూకన్నగారి గోపాల్‌రెడ్డి, బండారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి

**కడ్తాల్, జూలై 16, ప్రభాత వార్త :** ప్రజల సంక్షేమం, ఆరోగ్య భద్రత కోసం గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ ్మ నర్సింహ్మా రెడ్డి స్థానిక నేతలతో కలిసి హైదరాబాద్‌లో సంబంధిత శాఖ సంచాలకుల కార్యాలయంలో సీపీఓకి వినతిపత్రం ఇచ్చారు. వెంటనే నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం

### బిజెపి ఎన్నికల కన్వీనర్ తాళ్లపల్లి బాలేశ్వర్‌గుప్తా

**యాలాల జూలై 16 ప్రభాతవార్త :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి వార్డు మెంబరు నుంచి జిల్లా పరిషత్ వరకూ అన్ని స్థానాల్లో పోటీ చేసి సత్తా చాటుతోందని వికారాబాద్ జిల్లా బిజెపి ఎన్నికల కన్వీనర్, యాలాల మండల పరిషత్ మాజీ అధ్యక్షులు తాళ్లపల్లి బాలేశ్వర్‌గుప్తా పేర్కొన్నారు.మంగళవారం బిజెపి అధిష్ఠానం బాలేశ్వర్‌గుప్తాను పార్టీ ఎన్నికల కన్వీనర్‌గా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగ ఆయనను బిజెపి రాష్ట్ర కైన్సిల్ సభ్యులు నాయకులు బాలి శివకుమార్, జిల్లా యువ మోర్చా మాజీ అధ్యక్షులు విజయకుమార్, మాజీ ఎంపిటిసి సభ్యులు సాయిరెడ్డి, సాధుపరిషత్ రాష్ట్ర అధ్యక్షులు శంకర్ స్వామి, నాయకులు బొప్పి శ్రీహరి, చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ సాహో శ్రీలత సుదర్శన్‌గౌడు, ఆంజనేయులు పలువురు కార్యకర్తలతో కలిసి బాలేశ్వర్‌గుప్తాను సన్మానించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ అధిష్ఠానం నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. తనను స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ భాధ్యత అప్పజెప్పడంలో సహకరించిన పార్టీ శ్రేణులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టి బిజెపి విజయానికి కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. వార్డు మెంబరు నుంచి జిల్లాపరిషత్ పీఠాలను కౌవసం చేసుకునేందుకు పార్టీ వ్యూహాత్మకంగా ముందుకు పోతుందన్నారు.



బాలేశ్వర్‌గుప్తాను సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

## గురుకుల పాఠశాలలో అధికారుల తనిఖీ

**కొడంగల్, జూలై 16ప్రభాతవార్త :** విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తహశీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అంతకుముందు విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. బియ్యం, కురగాయలు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి తీసుకుందని,వారికి సన్నబియ్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న తహశీల్దార్

## నేడు లయన్స్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

**కొడంగల్, జూలై 16ప్రభాతవార్త:** కొడంగల్ లయన్స్‌క్లబ్ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం కొడంగల్‌లో నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ సభ్యులు తెలిపారు.కొడంగల్ పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో గురువారం సాయంత్రం లయన్స్‌క్లబ్ 37వ ఇనిస్టాలేషన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని తెలిపారు.నూతనంగా ఎన్నికైన లయన్స్‌క్లబ్ అధ్యక్షులు లయన్ మురారి వశిష్ట, సెక్రటరీగా వడ్డే భీంరాంజ్, కోశాధికారిగా డి.వెంకట్‌రెడ్డిలచే ప్రమాణ స్వీకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ ఏ.నటరాజ్,మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మేన్ గురునాథ్‌రెడ్డి, మృత్యుంజయ, జోనల్ చైర్మేన్ పాటు మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, దాసప్పయాదవ్ తదితరులు హజరుకానున్నట్లు తెలిపారు.

## తల్లిదండ్రుల సేవతోనే ఉన్నతస్థాయికి ఎదిగా

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 16, ప్రభాతవార్త :** కన్నతల్లికి, పుట్టిన ఊరికి సేవకై ప్రతిఒక్కరూ ముందుకు రావాలని తాండూరు నియోజకవర్గ లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడు రాస్నం శరణు బసప్ప కోరారు. బుధవారం తన సొంత గ్రామమైన యాలాల మండలం తిమ్మాయిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాల తరగతి గదులకు సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులకు సేవ చేయడం వల్ల ఉన్నతస్థాయికి ఎదిగానని గుర్తు చేశారు. ప్రతీ యేటా వారి జ్ఞాపకార్థం పేద విద్యార్థులకు ఇతోదిక సహాయం అందజేస్తున్నానని తెలిపారు. బాల్యమంతా తిమ్మాయిపల్లి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని, అప్పటి ఉపాధ్యాయులను ఎన్నటికీ మరిచిపోలేనని కొనియాడారు. ప్రతి మనిషి స్వయంశక్తితో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. పెద్దలను, గురువులను గౌరవించాలని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యదర్శి మంకాల నటరాజ్, ట్రెజరర్ గౌరవీశంకర్, సల్లా దామోదర్, సొమానీ, బసనప్ప, వీరప్రసాద్, గోపాలకృష్ణ, సంతప్ప, గ్రామపెద్దలు విఠల్‌రెడ్డి, భీమప్ప, కృష్ణ, లక్ష్మమ్మ, హెడ్‌మాస్టర్ అలవేలు, రామకృష్ణ, జయంతి, విద్యాకమిటీ చైర్మన్ భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజులపాటు చండీ యాగం

**కొడంగల్, జూలై 16 ప్రభాతవార్త :** రాష్ట్ర సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో విరాజిల్లుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర దూప దీప నైవేద్య అర్చక సంఘం అద్వర్యంలో చేపట్టిన శ్రీ చండీ కుబేర పాశుపత యాగాలలో పాల్గొనేందుకు బుధవారం స్థానిక అర్చక బృందం సభ్యులు హైద్రాబాద్‌కు తరలివెళ్ళారు. హైద్రాబాద్‌లోని తుల్జాభవన్ ధర్మశాలలో డిడిఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు దౌల్తాబాద్ వాసు దేవశర్మ అద్వర్యంలో మూడు రోజుల పాటు యాగాలను నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ ఆర్. గురునాథ్‌రెడ్డి బుధవారం యాగ శాలలో యాగాలను, దేవతా మూర్తు లను దర్శించుకున్నారని .డిడిఎన్ఎస్ జిల్లా అధ్యక్షులు లోకూర్తి జయతీర్ధాచారి తెలిపారు. కార్యక్రమంలో నటరాజ్‌స్వామి, అభిలేష్‌స్వామి, జగదీష్, సంతోష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



శ్రీచండీ కుబేర పాశుపతి యాగంలో పాల్గొన్న అర్చకులు

## కెమిస్ట్రి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

**పెద్దేముల్, జూలై 16, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం గొట్లపల్లి మాడల్ స్కూల్‌లో ఖాళిగా ఉన్న పిజిటి-కెమిస్ట్రి పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గాయత్రి ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు యంఎస్‌సి (కెమిస్ట్రి), బీఈడి, టెట్ అర్హతలు కలిగి యుండాలని అన్నారు. ఈ నెల 18వ తేది సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

## చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

**పెద్దేముల్, జూలై 16, ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. బుధవారం పెద్దేముల్ మండలం మారేపల్లి కేజీబివిని ఆయన సందర్శించి బియ్యం, కూరగాయలు, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. పాఠ శాలలో నెలకొన్న పరిస్థితులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్, కరెంటు సమస్యలను ప్రిన్సిపాల్‌ను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్బంగా అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష సాధన దిశగా ముందుకు సాగాలని అన్నారు. విద్యార్థులు కష్టంతో పాటు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, యంపిడిఓ రతన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ రాజేశ్వరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్

## బాలేశ్వర్ గుప్తాకు సత్కారం

**వికారాబాద్, జూలై 16, ప్రభాతవార్త :** బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్‌గా నియమితులైన బాలేశ్వర్ గుప్తను బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎంపీపీ, సింగల్ విండో డైరెక్టర్‌గా వంటి బాధ్యతలు నిర్వర్తించిన బాలేశ్వర్ గుప్తకు రాజకీయంగా చాలా అనుభం ఉందని అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో వికారాబాద్ జిల్లాలోని భారతీయ జనతా పార్టీ ఎక్కువ స్థానాలు గెలుచుకుంటుందన్నారు.

## పచ్చని తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

### చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, జూలై 16, ప్రభాతవార్త :** పచ్చని తెలంగాణగా మార్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు.బుదవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ కాలనీ, ఆలూరు గ్రామంలోని ప్రభుత్వ అసుపత్రిలో వన మహోత్సవంలో బాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా చేవెళ్ళ ఏమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచి అకుపచ్చని తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా వన మహోత్సవంను నిర్వహిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు ప్రతి గ్రామంలో మొక్కలను పెంచాలన్నారు. మొక్కల పెంపునకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. చెట్లు పెంచినప్పుడే వర్షాలు కూడ సమృద్ధిగా కురుస్తాయన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి వద్ద ఒక్కో మొక్కను నాటాలన్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చెట్లు పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ వెంకటేశం, పోల్యూషన్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గ నాయకుడు సున్నపు వసంతం, చేవెళ్ల మార్కెట్ కమిటి చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపిటిసిలు బక్కరెడ్డి రవీందర్‌రెడ్డి, గుండాలరాములు, సర్పంచులు జనార్దన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బండారి శైలజ ఆగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు నరేందర్, మల్లేష్, మదుసూదన్‌రెడ్డి, మద్దేల శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆలూరు పిహెచ్‌సిలో మొక్కలు నాటుతున్న చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య